వంకలు ఆక్రమించి నిర్మాణాలు

- అధికారులకు ఫిర్యాదు చేసినా దాల్మియాకే వత్తాసు పలుకుతున్నారు
- రెండో ప్లాంట్ వస్తే మా పరిస్థితి ఏమిటంటున్న రెండు గ్రామాల రైతులు


బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇల్లు

మైలవరం : దాల్మియా యాజమాన్యం అలుగోగు వంకను పూర్తిగా ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మాణం చేయడం వల్ల తమ గ్రామాలు తీవ్ర వరదబారిన పడటమే కాకుండా పంట పొలాలు దెబ్బతింటున్నాయని తదితర గ్రామాల ప్రజలు అంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎటువంటి ప్రయోజనంలేదని దాల్మియా బాధిత గ్రామాలైన నవాబుపేట, దుగ్గనపల్లి, చిన్న కొమెర్ల గ్రామస్తులు వాపోతున్నారు. సిమెంట్ రాయి కోసం బ్లాస్టింగ్ చేస్తున్న దాల్మియా యాజమాన్యం నిబంధనలు పాటించకుండా భారీగా పేలుడులతో రాయిని వెలికి తీస్తున్నారు. దీంతో ఆ పేలుడు ధాటికి తమ ఇళ్లు దెబ్బతింటున్నాయని నవాబుపేట గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే ఫ్యాక్టరీ నుంచి వస్తున్న బూడిద సాగు చేసిన పంటలపై పడటంతో పంట దెబ్బతినడంతోపాటు దిగుబడి కూడా రావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. చిన్నకొమెర్ల నుంచి నవాబుపేట వరకు రైల్వే ట్రాక్‌వద్ద నుంచి భారీగా మట్టి కట్ట వేయడంతో గతంలో వర్షాలు వచ్చినప్పుడు కిలోమీటరు వెడల్పుతో రెండు మూడు వంకల ద్వారా నీరు ప్రవహించేది. అయితే ఈ మట్టి కట్ట వేయడం వల్ల ఒక వంక నుంచే నీరు ప్రవహించడంతో నీరు రోజుల తరబడి పొలాల్లో నిలచిపోతుంది. గతంలో 33 వేల క్యూసెక్కుల నీరు వర్షపు నీరు వంకద్వారా ప్రవహించేది. ప్రస్తుతం ఉన్న 8 వేల క్యూసెక్కులకు మించి ప్రవాహానికి అనువుగా లేదని దీని వల్ల దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామాలకు చెందిన పొలాల్లో రోజుల తరబడి నాలుగు నుంచి ఆరు అడుగుల వరకు నీరు ఉండటంతో పొలాలు సాగుకు అనుకూలంగా లేకుండాపోయాయన్నారు. ప్రస్తుతం దాల్మియా ఫ్యాక్టరీ దుగ్గనపల్లి వద్ద ఏర్పాటు చేసిన కాంపౌండ్ గోడవల్ల వర్షకాలంలో నీరు ఎక్కువగా నిలబడుతుందని గతంలో ఫ్యాక్టరీలు పనులు అపుకునే పరిస్థితి వచ్చింది. నీటి వత్తిడికి తట్టుకోలేక చాలా సార్లు ఫ్యాక్టరీ కాంపౌండ్ గోడ కూలిపోయిందన్నారు.


పంటలపై పడిన బూడిద

సమస్యలను పరిష్కరించాలి

ప్రస్తుతం దాల్మియా యాజమాన్యం రెండో యూనిట్ ప్రారంభించాలని మార్చి 27వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికి చూస్తోందన్నారు. దుగ్గనపల్లి, నవాబుపేట, చిన్నకొమెర్ల గ్రామానికి చెందిన ప్రజలు రైతులకు న్యాయం చేయాలన్నారు. లేదంటే రెండు గ్రామాలకు సంబంధించిన భూములను ఫ్యాక్టరీ యాజమాన్యం కొనుగోలు చేసి పరిహారం ఇవ్వాలని సూచించారు. యాజమాన్యం సమస్యలపై స్పందించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైతులు భారీగా నష్టపోతున్నారు



ఫ్యాక్టరీ వల్ల ఒకవైపు బూడిద మరోవైపు వరద ప్రవాహంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. వర్షకాలంలో పంటలు వేసుకోవటానికి నీరు ఉండటంతో ఇబ్బంది పడుతుంటే పంట చేతికి వచ్చె సమయంలో ఫ్యాక్టరీ నుంచి వచ్చె బూడిద పంటపై పడి సరైన సూర్యరశ్మి అందక పంట పూర్తిగా దెబ్బతింటుందని, దీని వల్ల రైతులకు దిగుబడి రాక నష్టపోతున్నారు.

– జగదీశ్వరరెడ్డి, సర్పంచ్, చిన్నకోమెర్ల

గోడ కట్టడంతోనే ఇబ్బందులు



ఫ్యాక్టరీ యాజమాన్యం వంకలకు గోడ కట్టడం వల్ల వర్షా కాలంలో భారీగా వంకలో నీరు ప్రవహించకుండా గొడలు అడ్డుకుంటున్నాయి. దీంతో తలమంచిపట్నం ఆయకట్టుకింద ఉన్న మా పంట భూములలో నీరంతా నిలబడిపోతుంది. తమ పంటలను కౌలుకు కూడా తీసుకునే వాడు లేడు. అమ్ముదామంటే కొనేవారులేరు. కేవలం దాల్మియా యాజమాన్యం వంకలు అక్రమించి నిర్మాణం చేపట్టడంతోనే తమకు ఇన్ని ఇబ్బందులు పడుతున్నాము.

– మేరియమ్మ, దుగ్గనపల్లి, మైలవరం

క్లుప్తంగా

రేపు వైద్య నిపుణుల రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విద్యార్థినులకు చలికోట్ల పంపిణీ

సింహాద్రిపురం : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం పోరుమామిళ్లలోని చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు చిత్తా థామస్ రెడ్డి, డాక్టర్ గీతా దంపతులు, సంస్థ ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డిలు విద్యార్థినులకు ఉచితంగా చలి కోట్లను పంపిణీ చేశారు. హాస్టల్లో ఉండి చదువుతూ చలికాలంలో ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో ఇవి పంపిణీ చేశామన్నారు. కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలను సాధించగలరన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని రేపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పంగా రాజా కుమారుడు నూతన వధూవరులైన బయన్న, నాగజ్యోతిల వివాహం శుక్రవారం రేపల్లె గ్రామంలో జరిగింది. వివాహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

దుస్తుల అందజేత

వేముల : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. పోరుమామిళ్లలోని చిత్తా శౌరిరెడ్డి మోమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో పాఠశాలలోని 250 మంది విద్యార్థినులకు సంస్థ వ్యవస్థాపకులు చిత్తా తోమాస్‌రెడ్డి, డాక్టర్ గీత దంపతులు ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు.

వైవీయూ నీటి సరఫరా స్కీము పరిశీలన


వైవీయూ నీటి సరఫరా స్కీం గురించి మాట్లాడుతున్న జడ్పీ సిఈవో ఓబులమ్మ

వల్లూరు : మండలంలోని చెరువుకిందపల్లె సమీపంలో వున్న యోగివేమన యూనివర్శిటీకి నీటి సరఫరా చేసే స్కీమును జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఓబులమ్మ శుక్రవారం పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుతో కలిసి యోగివేమన సీపీడబ్ల్యూసీ స్కీమును సందర్శించారు. ఈ స్కీము ద్వారా యూనివర్శిటీతో పాటుగా ఏఏ గ్రామాలకు నీరు సరఫరా అవుతోందని ఆరా తీశారు. నీటి సరఫరా సక్రమ నిర్వహన గురించి పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచవచ్చు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 5, 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రతిభ పాఠం పరీక్షను ఎంఈఓలు, ప్రభుత్వ ఉపాధ్యాయుల అధ్వర్యంలో స్థానిక భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. హాజరైన డీఈఓ శంషుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించడం కోసం నిర్వహించిన ఈ పరీక్షలు విద్యార్థులలోను, ఉపాధ్యాయులలో పోటీ తత్వాన్ని పెంపొందించడానికి వీలవుతుందన్నారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నిత్యానందరాజు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

దోమలను నియంత్రించాలి

పులివెందుల రూరల్ : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా ఉప అధికారి డాక్టర్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. శుక్రవారం ఎర్రగుడిపల్లెలో ప్రజలకు దోమ కాటువల్ల వచ్చే వ్యాధుల గురించి ఆయన అవగాహన కల్పించి లార్వా సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారి కి రక్తపూతలు సేకరించి వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. డాక్టర్ శాంతకుమార్, మలేరియా అధికారి సిద్దయ్యలు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్య నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు చెన్నైకు చెందిన సుబ్రోస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హాజరు కానుందని, ఈ సంస్థ దాదాపు 600 మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న, పూర్తి చేసుకున్న విద్యార్థులతో పాటు ఐటీఐ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు సైతం ఈ ఇంటర్వ్యూకు హాజరై ప్లేస్‌మెంట్ పొందాలని ఆయన కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు తమ బయోడేటాతో పాటు అన్ని సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకు రావాలన్నారు. పూర్తి వివరాలకు ప్లేస్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి 98495 44298 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఘనంగా చండీ హోమం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రగుంట్ల : ముద్దనూరు రోడ్డులోని ఐసీఎల్ సమీపంలో వెలసిన శ్రీ సుంకులమ్మ అమ్మవారి పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో శుక్రవారం చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఈ హోమాన్ని నిర్వహించి వివిధ రకాల అభిషేకాలు పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని అమ్మవారికి కానుకలు సమర్పించి దర్శించుకున్నారు. భక్తులందరికి ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు పరిశీలన

లింగాల : స్థానిక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం జరుగుతున్న ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని ఏఓ రమేష్ పరిశీలించి మాట్లాడారు. భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేయవచ్చునన్నారు. ఇప్పటి వరకు మండలంలో 3 వేల మంది రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ చేశామని, అలాగే రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. రైతు సోదరులందరూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమపై యాజయాన్య పద్ధతులు పాటించాలి


పాడిరైతులకు మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు

కొండాపురం : గ్రామాల్లోని పాడి రైతులు పాడిపరిశ్రమపై తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించినట్లు పశువైద్యుడు రాజశేఖర్‌రాజు తెలిపారు. శక్రవారం ఓబన్నపేట గ్రామంలో పశువైద్యులు లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. లింగనిర్ధారణ వీర్యం ద్వారా పశువులకు కచ్చితత్వంతో పెయ్యి దుడలు పుట్టుటకు రూ.1350, వీర్య కనాలను రూ. 850 ప్రభుత్వం రాయితీ పొగ రైతు వాటాగా రూ.500 మాత్రమే చెల్లించి రైతులు వినియోగించుకొవాలన్నారు. పశుసంవర్ధక శాఖ పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శనలో దూడల ఎదుగుదలకు లివర్ టానిక్‌లు, కాల్షియం టానిక్ డీ విర్మింగ్ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు పాల్గొన్నారు.

బాత్రూంలలో వెదజల్లుతున్న దుర్వాసన


పాఠశాలలో అధ్వానంగా ఉన్న బాత్రూంలు

వేంపల్లె : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఉన్న బాత్రూంలలో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు బాత్రూంలోకి వెళ్లేలేక ఇబ్బందులు పడుతున్నారు. బాత్రూంలో ఉన్న పైపులు బ్లాక్ కావడంతో నీరంతా బాత్రూంలోనే నిలిచిపోతుంది. దీంతో తరగతి గదుల్లోకి బాత్రుంలో నుండి దుర్వాసన వెదజల్లుతున్నట్లు విద్యార్థులు అంటున్నారు. ట్యాంకులో నీరు లేకపోవడంతో బాత్రూంలలో నీరు రాకపోవడంతో బిందెలతో నీళ్ళు తెచ్చుకుని వాడుకొంటున్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పైపులు బ్లాక్ అయిన విషయం పాఠశాల హెచ్ఎంకు తెలిపినా పట్టించుకోవడంలేదని విద్యార్థులు అంటున్నారు. బాత్రూంలో ఉన్న కుళాయిలు కూడా విరిగిపోవడంతో ట్యాంకులో నీరు ఉన్న సమయంలో వృథాగా పోతున్నాయంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బాత్రూంలలో నీరు నిల్వ లేకుండా చేసి దుర్వాసన లేకుండా చేయాలని వారు కోరుతున్నారు.

మానసిక ఒత్తిడిని జయిస్తే విజయం మన సొంతం

పులివెందుల టౌన్ : మానసిక ఒత్తిడిని జయిస్తే విజయం మన సొంతమవుతుందని రొటేరియన్ నాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ త్రివేణి అధ్యక్షతన పరీక్షలు–మానసిక ఒత్తిడి అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రొటేరియన్ నాగేశ్వరరెడ్డి హాజరై మాట్లాడుతూ పరీక్షలు అంటే భయం వీడితే విజయం మన సొంతమవుతుందని, ప్రతి విద్యార్థి రీల్ హీరోలకు కాకుండా రియల్ హీరోలైన మన తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కొంతమంది కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరిన వారి గురించి భౌతికంగా దివ్యాంగురాలైన ఐఏఎస్ బాలలత, ఐపీఎస్ అక్షయ కుమార్, ఐఏఎస్ కృష్ణతేజ విజేతలైన వారి గురించి వారు శ్రమించిన విధానాన్ని చక్కగా వివరించారు. ఒత్తిడి మంచిదే గాని పరీక్షలపై ప్రభావం చూపేలా ఉండకూడదని, తల్లిదండ్రులు కూడా పరీక్షలు అనే భయాన్ని విద్యార్థిపై పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉపకారవేతనాలకు విద్యార్థినుల ఎంపిక

ముద్దనూరు : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు ఎంపికయ్యారు. గత ఏడాది డిసెంబరు నెలలో నిర్వహించిన ఈ పోటీ పరీక్షలో సుమ అఖిల, శైలు ఉపకారవేతనాలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. వీరిరువురికి ఒకొక్కరికి సంవత్సరానికి రూ.12వేల చొప్పున ఇంటర్మీడియేట్ వరకు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు.

పీ4 సర్వేకు ప్రజలు సహకరించండి

పులివెందుల టౌన్ : ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో (పీ4) ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి, ఏ కుటుంబం కుడా వెనుక పడకుండా సమ్మిళిత వృద్ధిని సాధించడమే పీ4 లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిరుపేదలైన ప్రజలకు సంఘంలో ఆర్థికంగా బలోపేతమైన వ్యక్తుల నుంచి ఆర్థిక, మౌలిక సదుపాయములు కల్పించుట దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సచివాలయ సిబ్బంది మార్చి 2వ తేదీవరకు మీ ఇంటి వద్దకు వచ్చినపుడు ప్రతి ఒక్కరు మీ యొక్క సమాచారాన్ని ఇవ్వాలన్నారు.

ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం : స్థానికంగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అర్చకులు శ్రీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో గణపతిపూజ, హోమాలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : పట్టణంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ 37వ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

మానసిక ఆరోగ్యానికి యోగ అవసరం

వేంపల్లె : మానసిక శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన ధ్యానంపై ఆయన మాట్లాడుతూ మానసిక శాంతికి, ఒత్తిడికి నియంత్రణకు యోగా చాలా ఉపయోగపడుతుందన్నారు. యోగా చేయడం వలన ఏకాగ్రత కూడా పెరుగుతుందన్నారు. సామాజిక ఆరోగ్యాన్ని కాపాడుతుందని, యోగా చేయడం వలన చాలా ఉపయోగాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ యోగా చేయాలని కోరారు.

మాతృ భాషను గౌరవిద్దాం


వేంపల్లెలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కమలాపురం : సకల భాషలలో కెల్లా మాతృభాష గొప్పదని, మాతృ భాషను గౌరవిద్దామని, మాతృ భాషలోనే మాట్లాడుకుందామని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా ప్రాచుర్యం పొందిన ఏకైక భాష మన మాతృ భాష అని, దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవ రాయలు చే కీర్తించబడిన భాష మన తెలుగు భాష అని అన్నారు. మాతృ భాషను మరిచితే మాతృ మూర్తిని మరచినట్లేనన్నారు. మాతృ భాషను గౌరవిద్దామని, మాతృ భాషలోనే మాట్లాడుకుందామని పిలుపునిచ్చారు. తెలుగు భాషాధిపతి లక్ష్మయ్య మాట్లాడుతూ అంతర్జాతీయంగా మాతృభాషలను ప్రాధాన్యాన్ని యునెస్కో గుర్తించి 2000 ఫిబ్రవరి 21వ తేదీ నుంచి ప్రతి దేశం కూడా అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం నిర్వహించుకోవాలని తెలిపిందన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఫిబ్రవరి 21వ తేదీన మాతృభాష దినోత్సవంగా జరుపుకుంటున్నా మన్నారు. పరీక్షల నిర్వహణ అధికారి పల్లాకృష్ణ, ఐక్యూస్ఈ కోఆర్డినేటర్ వినయ్ తదితరులు మాట్లాడారు.

వేంపల్లెలో..

వేంపల్లె : అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల తెలుగు శాఖ విభాగం ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు మాట్లాడుతూ మాతృ భాషకు ఆయువు పోయడం ద్వారా ఆయా జాతుల మనుగడకు దోహదం చేసినవారవుతామన్నారు. అలాగే అధ్యాపకురాలు డాక్టర్ నాగలక్ష్మీదేవి మాట్లాడుతూ బిడ్డ ఎదుగుదలకు అమ్మపాలు ఎంత అవసరమో, ఆ బిడ్డ వికాసానికి మాతృ భాష కూడా అంతే అవసరమన్నారు. ఓ వ్యక్తి సంపూర్ణ వికాసానికి తోడ్పడేది మాతృ భాష ఒక్కటేనన్నారు. అధ్యాపకురాలు మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ పరభాషను ప్రేమించాలి.. మాతృ భాషను గుండెల్లో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : తెలుగుభాషను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ డీఈఓ యు.మీనాక్షి తెలిపారు. శుక్రవారం బాలుర జూనియర్ కాలేజిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించినప్పుడు మిగతా భాషలపై పట్టుసాధించే అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు మాతృభాష అవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు పాల్గొన్నారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి


శివరాత్రి ఏర్పాట్లకు సిబ్బందికి సూచనలు అందిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

జమ్మలమడుగు రూరల్ : ఈనెల 26వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చె భక్తులకు సమస్యలు లేకుండా చూడాలని ఆర్డీఓ అదిమాలం సాయిశ్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని కన్యతీర్థం ఆలయాన్ని ఆమె అధికారులతో కలసి పరిశీలించి వారికి సూచనలు, సలహాలు అందించారు. దర్శనం కోసం వచ్చె భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక భారీకేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పండుగ రోజున విద్యుత్ సమస్య, తాగునీటి సమస్య లేకుండా చూడలన్నారు. అంతే కాకుండా భక్తులను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్య రాకుండా వాహనాలను పార్కింగ్ చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. శివరాత్రి రోజు ఆలయ పరిసర ప్రదేశాల్లో ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటరిస్టుకు గాయాలు

ముద్దనూరు : మండలంలోని కమ్మవారిపల్లె సమీపంలో మోటార్‌బైక్ అదుపుతప్పి జగన్‌మోహన్‌రెడ్డి అనే యువకుడికి గాయాలయ్యాయి. కొండాపురం మండల బెంజి అనంతపురంకు చెందిన ఇతను ముద్దనూరు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు 108 సిబ్బంది తెలిపారు.

రేపు అంబకపల్లె ఆవులస్వామి ఆరాధన


అంబకపల్లెలోని ఆవులస్వామి ఆలయం

లింగాల : మండలంలోని అంబకపల్లెలో వెలసిన అవధూత శ్రీఆవులస్వామి ఆరాధన ఉత్సవాలను ఈనెల 23వ తేదీన ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ ధర్మకర్త తేజేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి ఏడాది మహాశివరాత్రికి ముందు వచ్చే ఆదివారం ఆవులస్వామి ఆరాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామానికి చెందిన దళిత వంశీకులైన మారెమ్మ, మారెప్పల కుమారుడు ఆవులస్వామి. ఆయనను చిన్నప్పుడు దొడ్డోడు అనే వారు. ఆయన యుక్త వయస్సు వచ్చే వరకు దిగంబరిగా తిరిగేవాడని గ్రామ పెద్దలు తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు దండించడంతో నల్లని కంబలి కప్పుకొని తిరిగేవాడన్నారు. ఆయన ఒంటిపై ఎప్పుడు దిద్దు (చమురు) కారుతూ ఉండేదన్నారు. గ్రామంలోని రైతుల ఆవులను కొండకు మేపుకునేందుకు వెళ్లేవారన్నారు. సమీపంలోని నూతి కోన వద్ద ఉన్న గుహలో తపస్సు చేసుకునేవాడన్నారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు భూత, భవిష్యత్, వర్తమాన కాలాల గురించి వివరించేవాడన్నారు. గాలి, గ్రహలతో బాధపడుతున్న వారికి తన శక్తితో ఉపశమనం కలిగించేవారన్నారు. అంబకపల్లె గ్రామం అటవీ ప్రాంతంలో ఉన్నందున రైతులు తరుచూ కీటకాల (పాము కాటు)బారిన పడేవారన్నారు. అలాంటి వారికి సమీపంలోని గంగమ్మ ఆలయం వద్ద ఉన్న వేపచెట్టు ఆకులు, పచ్చి కొబ్బరి ప్రసాదంగా ఇచ్చేవారన్నారు. దీంతో వారికి ఉపశమనం లభించేదన్నారు. ఆయన వివాహం చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండేవాడన్నారు. తనను జీవ సమాధి చేయాలని గ్రామ పెద్దలను కోరారని.. అప్పటి గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి ప్రజల ఒప్పందంతో ఆయన అభీష్టం నెరవేర్చేందుకు ఆయనను జీవ సమాధి చేశారు. ఆ సమయంలో నాకు ఆలయాన్ని నిర్మించి ప్రతివారం పూజలు నిర్వహించాలని కోరారన్నారు. పాము కాటుకు గురైన వారు, గాలి గ్రహాలతో బాధపడుతున్న వారు మూడు ఆదివారాలు నా సన్నిధిలో సేద తీరితే వారికి ఉపశమనం లభిస్తుందని ఆయన చెప్పారన్నారు. అదే రీతిన ఆవులస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయం

ఆవులస్వామి మహత్యంవల్ల ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ఆవులస్వామి జీవ సమాధి చుట్టూ చిన్నపాటి గుడి ఉండేది. ప్రస్తుతం పెద్ద ఆలయం నిర్మించబడింది. భక్తులు సేద తీరేందుకు పెద్ద, పెద్ద వరండాలు వెలిశాయి. ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది.

రేపు పంచరత్నాలు నాటక ప్రదర్శన

ఆవులస్వామి ఆరాధన సందర్భంగా ఆదివారం భక్తుల జాగరణ నిర్వహించేందుకు గ్రామస్తుల ఆధ్వర్యంలో పంచరత్నాలు నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా కోలాటాలు, చెక్కభజనలు నిర్వహిస్తున్నారు. అలాగే ఆలయానికి వచ్చే భక్తులకు ఆదివారం ఉదయం 8 గంటల నండి రాత్రి 12 గంటలవరకు నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆవులస్వామి ఆరాధన సందర్భంగా వచ్చే భక్తులకు పులివెందుల, ముదిగుబ్బ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్లు తెలిపారు.